# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 28 జూన్ 2024 | VIKARABAD




చిన్న చిన్న పనులు మినహా పూర్తైన ప్రభుత్వ జనరల్ దవాఖాన

# రూపాయీ విదల్చలేదు

**అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖాన నిర్మాణానికి పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం**

- నిధుల కొరతతో నిలిచిన చిన్న, చిన్న పెండింగ్ పనులు
- బీఆర్ఎస్ హయాంలో రూ.30 కోట్లు విడుదల.. దాదాపుగా అన్ని పనులు పూర్తి
- వికారాబాద్ జిల్లావాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందేదెప్పుడో .. వారి నిరీక్షణ తీరేదెప్పుడో..

వికారాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం ప్రతి జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఖరీదైన వైద్యవిద్యను ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా దవాఖానల నిర్మాణానికి కూడా నిధులిచ్చింది. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖానగా అందుబాటులోకి వస్తుందని రెండేండ్లుగా ఎదురుచూస్తున్న జిల్లా ప్రజానీకానికి నిరాశ మాత్రం తప్పడం లేదు. అనుబంధ దవాఖాన భవన నిర్మాణ పనులు పూర్తైనా చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండడంతో ఆ భవనాన్ని అందుబాటులోకి తేవడంలేదు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో విద్యుత్తు, పైప్‌లైన్, ఫర్నిచర్ తదితర పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ విద్యార్థులకు రెండో సంవత్సరం నుంచి ప్రాక్టికల్స్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఓ వైపు మొదటి సంవత్సరం పూర్తవుతుండడం, మరోవైపు ఇంకా అనుబంధ దవాఖాన అందుబాటులోకి రాకపోవడంతో ప్రాక్టికల్ తరగతులను వికారాబాద్‌లోని సీహెచ్‌సీ దవాఖానలో నిర్వహించాలని కాలేజీ యాజమాన్యం నిర్ణయించినట్లు తెలిసింది. ఒకవేళ ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసినా పనులు పూర్తై ఆ భవవాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆరునెలల సమయం పట్టే అవకాశం ఉన్నది. దీంతో వికారాబాద్‌లోని సీహెచ్‌సీలోనే ప్రాక్టికల్ తరగతులు నిర్వహించేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

## సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలెప్పుడో..

జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా నిర్మిస్తున్న 380 ప్రభుత్వ జనరల్ దవాఖానతోపాటు 20 పడకల ఐసీయూ కలిపి మొత్తం 400 పడకల దవాఖాన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.30 కోట్లను విడుదల చేసింది. ఆ నిధులతో అనుబంధ దవాఖాన భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులకు నిధుల కొరత ఏర్పడి ఆరు నెలలుగా నిలిచిపోయాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖాన నిర్మాణంతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించిన జిల్లా ప్రజలకు ఇంకా ఎదురుచూపులే మిగిలాయి. దీంతో వారికి సాధారణ వైద్యసేవలు మినహా మిగతా వైద్యసేవలకు హైదరాబాద్‌కు వెళ్లాల్సిందే. జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లేసరికి మార్గమధ్యంలోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులున్నాయి. ఈ దయనీయ పరిస్థితి త్వరలోనే పోతుందని అనుకున్నా జిల్లావాసులకు నిరీక్షణ, నిరాశ మాత్రం తప్పడం లేదు. అయితే జిల్లా మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖాన అందుబాటులోకొస్తే అన్ని రకాల వైద్యసేవలు నిరంతరం అందడంతోపాటు అత్యాధునిక వైద్య చికిత్సలూ ప్రజలకు చేయనున్నారు. అదేవిధంగా ప్రస్తుతం 12 వైద్య సేవలు కొనసాగుతుండగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధ దవాఖానగా మారితే 26 రకాల వైద్యసేవలు జిల్లావాసులకు అందనున్నాయి. అంతేకాకుండా ఐసీయూ, ట్రామా కేంద్రాల సేవలూ అందనున్నాయి. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా మారుతాయి.

## రెండో జత యూనిఫాం అందించాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో రెండో జత యూనిఫామ్ త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యార్థుల యూనిఫామ్, బడుల మరమ్మతులపై సంబంధిత శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ, పట్టణ, మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే ఒక జత యూనిఫామ్ అందించడం జరిగిందన్నారు. ప్రతి బడిలోనూ విద్యార్థులకు కనీస వసతులైన తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు కల్పించాలన్నారు. పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఇంజినీర్లు, డీఈవో, ఎంఈవోలకు సూచించారు. సమావేశంలో డీఈవో సుశీందర్‌రావు, పీఆర్ఈఈ , ఇంజినీర్ అధికారులు, ఎంఈవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

- అందుకు అన్ని వర్గాల వారు సహకరించాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- ఫ్యాబ్‌సిటీ ఆవరణలో వాకథాన్
- ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ సీపీ తరుణ్‌జోషి

రంగారెడ్డి, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని.. అందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ, యువత, సమాజంలోని అన్ని వర్గాల వారు సమష్టిగా కృషి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ ఆవరణలో పోలీసు, ఎక్సైజ్, మహిళా, శిశు సంక్షేమ, మెడికల్ శాఖల సంయుక్తాధ్వర్యంలో గురువారం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించి.. మాట్లాడుతూ సమాజానికి పట్టిన చీడపురుగు లాంటి డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నదన్నారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతో పాటు కళాశాలల్లో రాచకొండ కమిషనరేట్ ద్వారా ప్రభుత్వ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

### బంగారు భవితను నాశనం చేసుకోవద్దు

సాధారణ ప్రజలు, విద్యార్థులంతా డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలన్నారు. మత్తు పదార్థాల బారిన పడడంతో యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతుంది. యువతీయువకులు వాటికి దూరంగా ఉండాలి

-తరుణ్‌జోషి,
రాచకొండ పోలీస్ కమిషనర్


కార్యక్రమానికి హాజరైన అధికారులు, పోలీసులు, విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

కార్యక్రమానికి ముందు కలెక్టర్ శశాంక, రాచకొండ సీపీ తరుణ్‌జోషి వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, మహిళా, శిశు, సంక్షేమ శాఖల అధికారిణి పద్మజారమణ, డీసీపీ క్రైమ్ అరవింద్‌బాబు, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషావిశ్వనాథ్, ఏసీపీ నరేందర్‌గౌడ్ అధికారులు, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రతిజ్ఞ చేస్తున్న.. వాకథాన్‌లో పాల్గొన్న యువతీయువకులు


### కేసీఆర్ హయాంలో నాణ్యమైన విద్యుత్తు..



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా అయ్యింది. 2014 కంటే ముందు ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోతలతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. దీంతో స్వరాష్ట్రంలో ఎవ్వరూ విద్యుత్తు కోతలతో ఇబ్బంది పడొద్దనే సదుద్దేశంతో కేసీఆర్ నిరంతరంగా సరఫరా చేశారు. అటు వ్యవసాయం చేసే రైతులతోపాటు గృహ వినియోగదారులకు కూడా విద్యుత్తు కష్టాలను దూరం చేశారు. అన్ని వర్గాల బాగు కోసం నిరంతరం పరితపించిన ఆయన్ను బద్నాం చేయడం సరికాదు.

-బోనాల వెంకటేశ్, చందనవెల్లి, షాబాద్, రంగారెడ్డి జిల్లా

# ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో..!



- 2014కు ముందు అరకొర విద్యుత్తే
- అప్పట్లో ఎవుసానికి ఆరేడు గంటల కరెంటే
- లో వోల్టేజీతో మోటర్లు కాలిపోయేవి
- అస్తవ్యస్థంగా ఉన్న కరెంట్‌ను గాడిన పెట్టింది కేసీఆరే
- ఆయనపై నిందలు వేయడం సరికాదు

**‘ స్వరాష్ట్రం వచ్చినప్పటి నుంచి పదేండ్ల కాలంలో కరెంట్‌కు ఢోకా లేదు. 2014కు ముందు అరకొర విద్యుత్తు సరఫరాతో అన్నదాతలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పటి ప్రభుత్వాలు ఎవుసానికి ఆరేడు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చేవి. లో వోల్టేజీతో మోటర్లు కాలిపోయేవి. రాత్రి వేళల్లో త్రీ ఫేస్ సరఫరాను నిలిపేసేవారు. విషపురుగుల బారిన పడి, విద్యుదాఘాతాల వంటి ప్రమాదాలతో ఎంతో మంది అన్నదాతలు మృతి చెందారు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ గత కాంగ్రెస్ పాలనను గుర్తుకు తెస్తున్నది. విద్యుత్తు కోతలు పెట్టడమే పనిగా పెట్టుకున్నది. విద్యుత్తు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. రైతులు పొలాల వద్దే నిరీక్షించాల్సిన దుస్థితి వచ్చింది. అస్తవ్యస్థంగా ఉన్న కరెంట్‌ను గాడిన పెట్టింది కేసీఆరే. మంచి చేసిన ఆయనపై నిందలు వేయడం తగదు. కరెంటు విషయంలో తప్ప పట్టాల్సిందేమీ లేదు’ అని రైతులు, ప్రజలు తదితరులు పేర్కొంటున్నారు.**

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

### రైతులు ఇబ్బందిపడుతున్నారు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్తు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. కేసీఆర్ సార్ సీఎంగా ఉన్నప్పుడు ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడలేదు. 24 గంటలపాటు సరఫరా ఉండేది. కానీ రేవంత్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదు.. విద్యుత్తు సరిగా లేకపోవడంతో రైతులందరూ ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో కరెంట్ పోయిందంటే కేసీఆర్ సార్‌నే గుర్తు చేసుకుంటున్నారు. ఆయనపై నిందలు తగవు.



-విజయ్ కుమార్,
పంచలింగాల్, మర్పల్లి,
వికారాబాద్ జిల్లా


### వ్యవసాయాన్ని పండుగలా మార్చారు

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. 2014 కంటే ముందు కరెంట్ కోతలతో రైతులు వ్యవసాయం అంటేనే భయపడ్డారు. అరకొర విద్యుత్తు సరఫరాతో పంటలు ఎండిపోయి రైతులు అప్పులపాలయ్యారు. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత ఏ ఒక్క రైతు కూడా కరెంట్ కోసం తిప్పలు పడొద్దనే 24 గంటలపాటు విద్యుత్తును సరఫరా చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయన వచ్చిన తర్వాతే తెలంగాణ రైతుల జీవితాలు బాగుపడ్డాయి.



సూద యాదయ్య, హైతాబాద్,
షాబాద్, రంగారెడ్డి జిల్లా

### కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు



పదేండ్లపాటు విద్యుత్తు కష్టాలే తెలియదు. కేసీఆర్ సార్ ఎక్కడి నుంచి తీసుకొచ్చి సరఫరా చేశా డో తెలియదు కానీ.. మేము ఎప్పుడూ విద్యుత్తు కోసం ఎదురు చూడలేదు.. పదేండ్లనుంచి వ్యవసాయం పండుగలా చేసుకున్నాం.. కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాక ముందు ఎలాంటి ఇబ్బందులు పడ్డామో.. మళ్లీ ఇప్పుడు ఆ కష్టాలే పడాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో.. పోతుందో తెలియడంలేదు.

-నాగరాజు రొంపల్లి,
బంట్వారం, వికారాబాద్ జిల్లా

# మహిళా క్యాంటీన్లు

**రంగారెడ్డి జిల్లాలో ఐదు చోట్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్న అధికారులు**

- మహిళలకు అండగా ఉండేలా మరిన్ని కార్యక్రమాలు..
- ఎస్‌హెచ్‌జీల ఎంపిక..శిక్షణకు సన్నాహాలు
- వచ్చే నెలలో కలెక్టరేట్ నుంచి లాంఛనంగా ప్రారంభం


రంగారెడ్డి, జూన్ 27 (నమస్తే తెలంగాణ): మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక మహిళా సంఘాల(ఎస్‌హెచ్‌జీ)ను మరింత బలోపేతం దిశగా కార్యాచరణను రూపొందిస్తున్నది. ఇందులో భాగంగా వారితో క్యాంటీన్లు పెట్టించాలని ప్రభుత్వం భావిస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో ఐదు మహిళాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని సంకల్పించగా.. ఇందుకు సంబంధించి గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే కసరత్తును మొదలుపెట్టింది.

**జిల్లాలో ఐదు చోట్ల క్యాంటీన్లు ..**

ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వం క్యాంటీన్లను ప్రారంభించగా.. జిల్లాకు చెందిన మహిళా సభ్యులు క్యాంటీన్ నిర్వహణలో పాలుపంచుకుంటున్నారు. ఇదే క్రమంలో జిల్లాలోని ఐదు ప్రాం తాల్లో క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన పట్టణాల్లో ప్రజ లు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కో యూనిట్ ధర రూ.15-25 లక్షల వరకు ఉండనున్నట్లు తెలిసింది. మహిళా సంఘాల నేతృత్వంలోనే క్యాంటీన్లు కొనసాగనున్నాయి. క్షేత్రస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించి ఆసక్తి చూపే సంఘాల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. వచ్చే నెల మొదటి, రెండు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించి సం ఘాల మహిళలకు శిక్షణనూ ఇవ్వనున్నారు. జూలై రెం డోవారంలో లాంఛనంగా కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**దన్నుగా నిలిచేలా మరిన్ని కార్యక్రమాలు..**

ఎస్‌హెచ్‌జీలకు ఈసారి ప్రభుత్వం ఏకరూప దుస్తులను కుట్టించే బాధ్యతలను అప్పగించగా వారు సక్సెస్ అయ్యారు. ఇదే తరహాలో మహిళలకు వెన్నుదన్నుగా నిలిచేలా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణను రూపొందిస్తున్నది. మీ-సేవా కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టమ్ హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పరిశ్రమలు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్‌పార్లర్లను ఏర్పాటు చేసేందుకు మండలాల వారీగా ప్రణాళిక రెడీ చేస్తున్నారు. యూనిట్లను నెలకొల్పేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. ఎంపిక చేసే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు.




**రుణాలతో ఆర్థికాభివృద్ధి దిశగా మహిళలు..**

మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణాలను అందిస్తున్నది. జిల్లాలో 19,209 స్వయం సహాయక సంఘాలుండగా..వాటిలో 2,06,116 మంది సభ్యులుగా ఉన్నా రు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12,950 సంఘాలకు రూ.708.79 కోట్లు రుణాలుగా అందించాలని లక్ష్యంగా పెట్టుకుని..అంతకుమించి 13,119 సంఘాలకు రూ.790.46 కోట్ల రుణాలను అందించారు. గతేడాదితో పోలిస్తే రూ.60 కోట్లు అదనంగా ఈ ఏడాది రూ.850.39 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేయనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో జిల్లాలోని మహిళా సంఘాలు స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయి. సభ్యుల ఆర్థిక అవసరాల మేరకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, కిరాణాషాపులు, పిండిగిర్నీ, టైలరింగ్, బ్యూటీపార్లర్, ఫుట్‌వేర్ తదితర వ్యాపారాలకు రుణాలను అందిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన సంఘాలు ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే వారికి కూడా విరివిగా రుణాలను అందజేస్తున్నారు. గతంలో బ్యాంకు లింకేజీ కింద రూ.లక్ష రుణం ఇచ్చేవారు. అయితే రెండేండ్ల నుంచి ఆ మొత్తాన్ని రూ.2 లక్షలకు పెంచారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా రాణిస్తున్నారు.

### మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఐదుచోట్ల నిర్వహణకు అనువైన స్థలాలను గుర్తించనున్నాం. అర్హులైన మహిళా సంఘాలను ఎంపిక చేసి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తాం. ఇతర యూనిట్లను సైతం నెలకొల్పి మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా చర్యలు తీసుకుంటునన్నాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీలత, డీఆర్డీవో, రంగారెడ్డి జిల్లా